నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, ఆదివారం 7 ఏప్రిల్ 2024 | SANGAREDDY

జహీరాబాద్ బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, పక్కన బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్



అబద్ధాల కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

- మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- జహీరాబాద్‌లో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం

కోహీర్, ఏప్రిల్ 6: అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. జహీరాబాద్ పట్టణంలో శనివారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబంధు రూ.15 వేలు, రూ.4వేల పింఛన్, మహిళలకు నెల నెలా రూ.2,500, నిరుద్యోగ భృతి రూ.4 వేలు, కల్యాణలక్ష్మి రూ.లక్షతో పాటు తులం బంగారం, బాలికలకు స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ పథకాలు పొందిన వారు కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, రానివాళ్లు మాత్రం బీఆర్ఎస్‌కు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నిచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. హామీలు అమలయ్యే వరకు కాంగ్రెసోళ్లను విడిచిపెట్టమన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అన్యాయంగా, అక్రమంగా కేసులు పెడితే వడ్డీతోసహా చెల్లిస్తామని స్పష్టం చేశారు. ప్రాణాలు ఇచ్చి కార్యకర్తలను కాపాడుకుంటామని భరోసా కల్పించారు.

కాంగ్రెస్, బీజేపీ దొందూదొందే...

బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం బీజేపీ చేసిందేమీ లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. పెట్రోల్ రూ.100, గ్యాస్ సిలిండర్ రూ.350 నుంచి రూ.1000కి పెంచిందని విమర్శించారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్ తెలంగాణ ఉద్యమకారుడని గుర్తు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌షెట్కార్, బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ ఇద్దరూ ఎన్నడూ జై తెలంగాణ అనలేదన్నారు. బీబీపాటిల్ రెండుసార్లు గెలిచినా లింగాయత్, ముదిరాజ్, యాదవులు, దళితులకు ఏమీ చేయలేదన్నారు. బీఆర్ఎస్ నాయకులను కొనడం మాత్రం పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలు దొందూదొందేనని విమర్శించారు. జహీరాబాద్ డివిజన్ ఏర్పాటు, మొగుడంపల్లి మండలం ఏర్పాటు, నియోజకవర్గ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమైందన్నారు.. ధాన్యానికి బోనస్ ఇస్తేనే కాంగ్రెస్ పార్టీ ఓటు అడగాలన్నారు. రైతుల ఉసురు పోసుకుంటున్న కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. ఇక్కడ కాంగ్రెస్ గెలిస్తే హామీలు అమలుకావన్నారు. రేజింతల్ సిద్ధి వినాయకుడి ఆలయాన్ని అభివృద్ధి చేశామన్నారు. సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతుండగా కరెంట్ కట్ అయింది. దీంతో అక్కడున్న నాయకులు, కార్యకర్తలు నవ్వుకున్నారు. మార్పు అంటే ఇలాగే ఉంటుందన్నారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు కోసం కేసీఆర్ ఎక్కని కొండ, మొక్కని దేవుడు లేడన్నారు. స్థానికులకే 95శాతం ఉద్యోగాలు లభించేందుకు కొత్త చట్టాలు తెచ్చారని కొనియాడారు. కాంగ్రెస్ మాత్రం అబద్ధాల మీదనే ప్రభుత్వాన్ని నడుపిస్తుందని, కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట మునుగుతామని చెప్పారు. సమావేశంలో జడ్పీ చైర్పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బెవరేజస్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం, టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్, విద్యుత్ బోర్డు మాజీ చైర్మన్ దశరథ్‌రెడ్డి, జడ్పీటీసీ స్వప్నాభాస్కర్, రామకృష్ణారెడ్డి, గుండప్ప, రవికిరణ్, మోహన్, అనుసూజ, చెంగల్ రాజశేఖర్, నర్సింహులు, నారాయణ, రవికిరణ్, ఆనంద్, నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జహీరాబాద్‌లో బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

కాంగ్రెస్, బీజేపీ దొందూదొందే..

- ఆత్మహత్య చేసుకున్న రైతులకు రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలి
- మామీద కోపం రైతులపై చూపకండి
- మోసం చేస్తూ రైతుల ఉసురుపోసుకుంటున్న కాంగ్రెస్, బీజేపీలు
- సంగారెడ్డి రైతు దీక్షలో మాజీమంత్రి హరీశ్‌రావు

ఎండిన పంటలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి

సంగారెడ్డి, ఏప్రిల్ 6: ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ. 25వేలు, ఆత్మహత్య చేసుకున్న రైతులకు రూ.20లక్షల పరిహారం ఇవ్వాలని మాజీమంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డి కొత్త బస్టాండ్ సమీపంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో రైతు దీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీమంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ మామీద, మా పార్టీ మీద కోపం రైతులపై చూపించవద్దన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలు ఇచ్చిన హామీలు, రైతులు పండించిన పంటలకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. రుణమాఫీ లేదు, పంటలకు పెట్టుబడి సాయం లేదన్నారు. కేసీఆర్ పాలనలో కరోనా కష్టం వచ్చినా ఈ రెండు పథకాలు ఎన్నడూ అపలేదన్నారు. అమలుకు నోచని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టడంలో కాంగ్రెస్, బీజేపీలకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ముఖ్యంగా రోజురోజుకూ రాష్ట్రంలో అన్నదాతలు అప్పులతో చనిపోతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. చనిపోయిన రైతులకు రూ. 20 లక్షల పరిహారం అందజేయాలన్నారు. లక్షల ఎకరాల్లో వేసిన పంటలు ఎండిపోతున్నా రైతుల్లో ఆత్మస్థైర్యం నింపడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం విడ్డూరమన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు పెద్ద పీట వేసి సాగుకు మందే పెట్టుబడి సాయం అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. మమ్మల్ని తిట్టండి.. కానీ రైతులను అదుకోండి అని మాజీమంత్రి హరీశ్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.


సంగారెడ్డి రైతు దీక్షలో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, వేదికపై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు

మాట తప్పడం కాంగ్రెస్, బీజేపీల నైజం

కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు దొందూదొందేనని, మద్దతు ధర ఇస్తామని చెప్పి మాట తప్పడం ఆ పార్టీల నైజమని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రైతులను ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. బీజేపీ కేవలం మత రాజకీయాలు చేస్తూ మరోసారి అధికారంలోకి రావాలని చేస్తున్న ప్రయత్నం విఫలవుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది..రాష్ట్రానికి కరువు తెచ్చిందని విమర్శించారు. రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని హరీశ్‌రావు భరోసానిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ చైర్పర్సన్ మంజుశ్రీ, డీసీసీబీ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యమ్, జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, ఎంపీపీలు, నాయకులు గాలి అనిల్‌కుమార్, దేవీప్రసాద్, రాజేశ్వర్ రావు దేశ్‌పాండే, కాసాల బుచ్చిరెడ్డి, మల్లాగౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి కేసీఆర్: చింతా ప్రభాకర్

రైతుల పక్షపాతిగా కేసీఆర్ పాలన చేశారని, పార్టీలపై కోపం రైతులపై చూపించలేదని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ఉత్తుత్తి మాటలతో కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ నైజమని ధ్వజమెత్తారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందన్న విషయం కాంగ్రెస్‌కు తెలియకపోవడం సిగ్గుచేటన్నారు. సాగు, తాగునీరు లేక పూర్వం కాంగ్రెస పాలనలో ఉన్న పరిస్థితి మళ్లీ మొదలైందని గుర్తుచేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అమలుకానీ హామీలపై రైతులకు వివరించాలని పార్టీ నాయకులకు సూచించారు.

తాగునీటికి ఇబ్బంది రాకుండా చూడాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, ఏప్రిల్ 6: సంక్షోభ సమయం మన పనితీరుకు పరీక్ష అని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. శనివారం మండలపరిధిలోని లింగాపూర్, రుస్తుంపేట్ గ్రామాల్లో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పక్కా ప్రణాళికతో నీటి ఇబ్బందులను అధిగమించాలని, శుద్ధిచేసిన నీటిని సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో చివరి నివాసప్రాంతం వరకు నీరుచేరేలా చూడాలన్నారు. స్థానికంగా ఉన్న నీటి వనరులను వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ ఆధారిత బోర్‌వెల్స్ ఎన్ని ఉన్నాయో గుర్తించి సిద్ధం చేసుకోవాలన్నారు. మిషన్ భగీరథలో అందుబాటులో ఉన్న అసిస్టెంట్ ఇంజినీర్లు, ఇతర సాంకేతిక సిబ్బంది షిఫ్టులవారీగా 24 గంటలు పనిచేస్తూ డిమాండ్ మేరకు అవసరమైన నీరు గ్రామీణ ప్రాంతాలకు చేరేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం లింగాపూర్, రుస్తుంపేట్ గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి తాగునీటిపై ఆరాతీసి సంతృప్తి వ్యక్తం చేశారు. మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో ప్రతిరోజూ పర్యటించి సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ కమలాకర్, ఇంట్రా ఈఈ సంపత్‌కుమార్, ఎంపీడీవో మధులత, అధికారులు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో మహిళతో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కాంగ్రెస్‌కు రైతుల ఉసురు తగులుతుంది

- కాంగ్రెస్ అసమర్థ పాలనతోనే పంటలు ఎండుతున్నాయి
- జోగిపేట రైతు దీక్షలో అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

అందోల్, ఏప్రిల్ 6: పంటలకు సాగునీరివ్వకుండా ప్రతి విషయాన్ని రాజకీయం చేస్తూ పంటలను ఎండబెడుతూ రైతుల ప్రాణాలు తీస్తున్న కాంగ్రెస్ పార్టీకి రైతుల ఉసురు తగులుతుందని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శనివారం రైతులకు మద్దతుగా జోగిపేట అంబేద్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన రైతుదీక్షలో పాల్గొన్న మాజీఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారం చేపట్టిన నాలుగు నెలల్లో తెలంగాణను ఎడారిగా మార్చిందన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో ఎక్కడ చూసినా పచ్చని పంటపొలాలు.. ధాన్యరాశులు దర్శనమిస్తే.. ఇప్పుడూ నీళ్లు లేకా నెర్రలుబారిన పొలాలు... ఎండిపోయిన కాల్వలు దర్శనమిస్తున్నాయని, ఇవన్నీ కాంగ్రెస్ చేతగానితనం వల్లే జరిగాయన్నారు. పాలన వ్యవస్థను గాలికొదిలేసి పార్టీ ఫిరాయింపులపై దృష్టి పెడుతున్నారు తప్పా.. సీఎం ఒక్కసారైనా ప్రజలు, రైతుల సమస్యలపై చర్చించారా అని ప్రశ్నించారు. మంత్రులు సైతం స్వంత పనులకు ఇచ్చిన ప్రాధాన్యత ప్రజాసమస్యల పరిష్కారానికి ఇవ్వడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రాధాన్యత మరెవ్వరికీ ఇవ్వలేదని, ఆయన ముందు చూపు, రైతులపై ఆయనకున్న శ్రద్ధ కారణంగా పదేండ్లపాటు ఎలాంటి కష్టాలు లేకుండా సంతోషంగా ఉన్నారని గుర్తుచేశారు. ఎన్నో ప్రాజెక్టులు కట్టి కాల్వల ద్వారా పంటలకు సాగు నీరందించిన ఘనత కేసీఆర్‌దని, ఆయన చొరవతో అందోల్ నియోజకవర్గం సైతం ఎంతో సస్యశ్యామలమైందన్నారు. సింగూర్ కాల్వల ద్వారా పంటలకు నీరందించడంతోపాటు తాలెల్మ ఎత్తిపోతలతో అందోల్, అల్లాదుర్గం, వట్‌పల్లి, టేక్మాల్ మండలాల రైతులకు సాగునీరందించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతాంగాన్ని నీరుగారుస్తూ వారి ఉసురు పోసుకుంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి రైతులు కర్రుకాల్చి వాతపెడుతారన్నారు. రైతు లెవ్వరూ అధైర్యపడొద్దని, మీకు అండగా బీఆర్ఎస్ ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రాధాన కార్యదర్శి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, మాజీ ఎంపీపీ రామాగౌడ్, నాయకులు లింగాగౌడ్, నారాయణ, నాగభూషణం, వెంకటేశం, వీరారెడ్డి, అశోక్‌గౌడ్, బుద్ధిరెడ్డి, బస్వరాజ్, సాయికుమార్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోగిపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

రైతుల ప్రాణాలు తీస్తున్న రేవంత్ సర్కార్

- ధాన్యానికి బోనస్ ఇవ్వకపోతే అన్నదాతలు నిలదీయాలి
- ఎంపీ ఎన్నికల్లో కర్రుకాల్చి వాతపెట్టాలి
- సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట నాయకులు, రైతులతో కలిసి దీక్ష

వంద రోజుల్లో సర్కారు పూర్తిగా విఫలం

సిద్దిపేట, ఏప్రిల్ 6: అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసి అధికారంలో వచ్చి ఇప్పుడు రైతుల ఉసురు తీస్తున్నాడని, నేడు వచ్చింది కాలం తెచ్చిన కరువుకాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని దుబ్బాక ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేటలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట జడ్పీ చైర్పర్సన్ వేలేటి రాధాకృష్ణశర్మ అధ్యక్షతన చేపట్టిన రైతుదీక్షకు మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రైతుబంధు జిల్లా మాజీ అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇంత వేగంగా ప్రాజెక్టులు నిర్మించి, నీళ్లు అందించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాళేశ్వరం అనే మహాయజ్ఞంలో చిన్న పొరపాటు జరిగితే సరిదిద్దాల్సిన ప్రభుత్వం రాజకీయాలు చేస్తూ రైతులతో ఆడుకుంటున్నదన్నారు. మేడిగడ్డ వద్ద రెండు పిల్లర్లు డెబ్బతింటే కాపర్ డ్యామ్ ఏర్పాటు చేసి, నీటిని ఎగువకు తరలించకుండా నిరక్ష్యంగా వ్యవహరించడంతో పొలాలకు పారాల్సిన గోదావరి జలాలు సముద్రం పాలవుతున్నాయన్నారు. కేసీఆర్ హయాంలో మిడ్‌మానేరు, రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నిండుకుండలా ఉండేవని, నేడు నీళ్లులేక వట్టిపోయాయన్నారు. నాడు సాగు సమయంలో ఇచ్చే రైతుబంధు సాయం నేడు పంటలు కోతకు వచ్చినా ఇవ్వడం లేదన్నారు. రుణమాఫీ, బోనస్ ఇవ్వకపోతే రైతులు అడుగడుగునా ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. అభివృద్ధిలో ముందున్న సిద్దిపేటపై రేవంత్ రెడ్డి సర్కారుకు కన్ను కుట్టిందని, చిన్నాభిన్నం చేయాలని కుట్రలు చేస్తున్నదన్నారు. 3 లక్షల ఓట్ల మెజార్టీతో నన్ను రెండు సార్లు గెలిపించారు.. ఇప్పుడు అదే పట్టుదలతో వెంకట్రామిరెడ్డిని గెలిపించి పార్లమెంటుకు పంపిస్తే మనకు ఎంతో గౌరవం ఉంటుందన్నారు. సంక్రాంతికి గంగిరెద్దులా ఇండ్ల ముందుకు వచ్చినట్లు ఎన్నికల సమయంలో కొందరు వస్తున్నారని, ఏవి నీళ్లో, ఏవి పాలో ప్రజలు గమనించాలన్నారు. దుబ్బాకలో చిత్తుగా ఓడిన వ్యక్తి నేడు బీజేపీ అభ్యర్థిగా వస్తున్నాడని, మళ్లీ చిత్తుగా ఓడించాలన్నారు. సిద్దిపేట, మెదక్‌లకు రైలు, సిద్దిపేటలో కేంద్రీయ విద్యాలయం, మెదక్ నుంచి ఈదులనాగుల పల్లికి రూ. 17,000 కోట్లతో కొత్త లైన్, చేగుంట జాతీయ రహదారిపై ఐదు బ్రిడ్జీలు, ఫ్లైఓవర్లు, 18 అండర్ పాస్‌లు, భెల్‌లో పెద్ద జంక్షన్ ఏర్పాటు చేశామని చెప్పారు. సిద్దిపేట జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కు మరోసారి పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు, సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డితో పాటు ఎంపీపీలు, జడ్పీటీసీలు, సొసైటీ చైర్మన్లు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

సిద్దిపేట రైతుదీక్షలో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, వేదికపై బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు

నీళ్లున్నా... రైతులకు కన్నీళ్లే: వెంకట్రామిరెడ్డి

నీళ్లున్నా ప్రాజెక్టులను ఎండబెట్టి సక్రమంగా కరెంట్ ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కన్నీళ్లు మిగిల్చిందని మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ పచ్చగా ఉండేనని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కరువు కష్టాలు ఏర్పడ్డాయన్నారు. తెలంగాణ రాక ముందు జనరేటర్లు, ఇన్వేటర్ల అవసరం ఉండేదని, నేడు నాటి కాలం దాపురించిందన్నారు. సీఎం కేసీఆర్ 24గంటల నాణ్యమైన కరెంటును సరఫరా చేశారన్నారు. కాంగ్రెస్ పాలన 100 రోజుల్లోనే విద్యుత్ వ్యవస్థ కుప్ప కూలిందన్నారు. ఎండిపోతున్న పంటలకు నీళ్లిచ్చి రైతలను ఆదుకోవాలన్నారు. కలెక్టర్‌గా మీతో కలిసి పనిచేశానని, నేడు ఎంపీ అభ్యర్థిగా మీ ముందుకొస్తున్నాను.. ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

హామీలు నెరవేర్చేదాక పోరాటం చేస్తాం: వేలేటి రాధాకృష్ణశర్మ

కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలు నెరవేర్చే దాక పోరాటం చేస్తామని జడ్పీ చైర్పర్సన్ వేలేటి రాధాకృష్ణశర్మ అన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు బోగస్ అంటున్న కాంగ్రెస్ నాయకులు సరస్వతి డ్యాంలోకి నీళ్లు ఎలా వస్తున్నాయో, మల్లన్న సాగర్ నుంచి కాలువ నీటిని మంత్రి కొండా సురేఖ ఎలా విడుదల చేశారో సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉన్న జిల్లాలను కుదించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. సిద్దిపేట వెటర్నరీ కళాశాలను రద్దు చేసిన సీఎంకు ఎంపీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌ను ఖతం చేయాలి: వంటేరు ప్రతాప్‌రెడ్డి

రైతులకు మాయమాటలు చెప్పి మోసం చేస్తున్న కాంగ్రెస్‌ను ఖతం చేయాలని మాజీ ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యానికి రూ. 500 బోనస్ ఏమైందన్నారు. ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టాలన్నారు.

ట్యాంకర్లే దిక్కాయే!

జగదేవ్‌పూర్ (కుకునూర్‌పల్లి), ఏప్రిల్ 6: కరెంట్ కోతలు, భూగర్భ జలాలు అడుగంటడం, ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల చేయక పోవడంతో యాసంగి వరి పొలాలను కాపాడుకోవడానికి రైతన్నలు అపసోపాలు పడుతున్నారు. సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండలం రాయవరంలో పలువురు రైతులు తమ పంటలను రక్షించుకోవడానికి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి తడులు అందిస్తున్నారు. శనివారం అటుగా వెళ్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఈ దృశ్యాన్ని చూసి రైతు కనకయ్యతో మాట్లాడారు. ఎంతో పెట్టుబడి పెట్టి కాయకష్టం చేసి వరి వేస్తే, చేతికి వచ్చే సమయంలో నీళ్లు లేక పంట ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతు కనకయ్య వంటేరు ప్రతాప్‌రెడ్డి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తప్పేది లేక అప్పులు తెచ్చి ట్యాంకర్ల ద్వారా నీళ్లు కొనుగోలు చేసి పంటలకు నీరందిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రాజెక్టుల నుంచి నీళ్లు విడుదల చేయకపోవడంతో కండ్ల ముందు చేతికొచ్చిన పంటలు ఎండుతుంటే రైతులు కన్నీరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొండపోచమ్మసాగర్, మల్లన్న సాగర్ కింద నీళ్లు ఇవ్వకుండా రైతుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ఎడారిగా మారే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ఇలాంటి దుస్థితి లేదన్నారు. రైతుల సమస్యలను పట్టించుకోవడంతో పాటు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు.


రాయవరంలో శనివారం వరిపైరుకు ట్యాంకర్ ద్వారా నీరు పెడుతున్న రైతుతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి